క్లుప్తంగా

అమ్మవారి దర్శనానికి పోటెత్తిన భక్తులు



అమ్మవారిని దర్శించుకునేందుకు వస్తున్న భక్తులు

పెనుగంచిప్రోలు: గ్రామంలో ఉన్న శ్రీతిరుపతమ్మ వారి దర్శనానికి ఆదివారం భక్తులు పోటెత్తారు. సెలవు దినంతో పాటు పలు శుభ కార్యాలు ఉండటంతో పెద్ద సంఖ్యలో భక్తులు తరలి వచ్చారు. దీంతో ఆలయ పరిసరాలు కిక్కిరిసాయి. భక్తులు అమ్మవారిని పాలు, పొంగళ్లతో దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు. రెండు తెలుగు రాష్ట్రాల నుంచి వేల సంఖ్యలో భక్తులు తరలి రావటంతో గ్రామంలో ట్రాఫిక్ అవరోధాలు లేకుండా పోలీసులు బందోబస్తు నిర్వహించారు.

నందిగామ రూరల్ పోలీస్ జట్టు విజయం



గెలుపొందిన జట్టుకు ట్రోఫీని అందజేస్తున్న ఏసీపీ నాగేశ్వరరెడ్డి

నందిగామ: డివిజన్ పరిధిలోని పోలీసులకు నిర్వహించిన టీజో కప్ 2023 క్రికెట్ టోర్నమెంట్ ముగిసింది. పట్టణంలోని జిల్లా పరిషత్ పాఠశాల ఆవరణలో డివిజన్ పరిధిలోని పోలీస్ జట్లకు క్రికెట్ టోర్నమెంట్ నిర్వహించారు. రెండు రోజులపాటు నిర్వహించిన ఈ పోటీలో నందిగామ రూరల్ జట్టు విజయం సాధించింది. విజేతలకు ఆదివారం ఏసీపీ నాగేశ్వరరెడ్డి ట్రోఫీని అందజేశారు.

రహదారి విస్తరణ పనుల పరిశీలన



సిబ్బందికి సూచనలు చేస్తున్న కమిషనర్ జయరాం

నందిగామ: పట్టణంలో ప్రధాన రహదారుల విస్తరణ పనులు వేగంగా జరుగుతున్నాయని కమిషనర్ డాక్టర్ జయరాం తెలిపారు. పట్టణంలోని రామన్నపేట రోడ్డులో జరుగుతున్న విస్తరణ పనులను ఆదివారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా సిబ్బందికి పలు సూచనలు చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ పట్టణంలోని అన్ని ప్రధాన రహదారులు అభివృద్ధి చేయనున్నట్లు తెలిపారు. ఇప్పటికే పలు రహదారుల్లో విస్తరణ పనులు కొనసాగుతున్నాయన్నారు. కార్యక్రమంలో ఆయన వెంట టౌన్ ప్లానింగ్ సిబ్బంది పాల్గొన్నారు.

నేడు స్పందన కార్యక్రమం

నందిగామ: పట్టణంలోని ఆర్డీవో కార్యాలయంలో సోమవారం స్పందన కార్యక్రమం జరుగుతుందని ఆర్డీఓ రవీంద్రరావు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రభుత్వం ప్రజా సమస్యలను సత్వరమే పరిష్కరించేందుకు స్పందన కార్యక్రమాన్ని ఏర్పాటు చేస్తోందన్నారు. డివిజన్ పరిధిలోని వివిధ మండలాల ప్రజలు ఈ కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

క్రీడాకారుడికి ఆర్థికసాయం



గోపాలకృష్ణను అభినందిస్తున్న ఆర్‌సీవై సభ్యులు

వత్సవాయి: అంతర్జాతీయ యూత్ కబడ్డీ పోటీలకు ఎంపికైన క్రీడాకారుడికి ఆదివారం ఆర్థికసాయాన్ని అందించారు. ఏప్రిల్ 10న నేపాల్‌లో జరగనున్న పోటీలకు వత్సవాయి గ్రామానికి చెందిన చంద్రగిరి గోపాలకృష్ణ ఎంపికయ్యారు. ఈ సందర్భంగా నేపాల్ వెళ్లి వచ్చేందుకు కావల్సిన ఖర్చులను అందించేందుకు బోడే రామచంద్రయాదవ్ ముందుకు వచ్చారు. ఈ విషయం ఆర్‌సీవై సభ్యులు గోపాలకృష్ణను కలుసుకుని తెలిపారు. కార్యక్రమంలో ఏఎంసీ డైరెక్టర్ పండగ శ్రీను, సభ్యులు పచ్చిపాల నాగేశ్వరరావు, బొల్లిగొర్ల రమేష్‌బాబు, ఆవుల రామారావు, రాచబంటి సత్యశేఖర్, గుమ్మా చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

రేపు నందిగామలో మాజీ సైనికుల సమావేశం

నందిగామ: పట్టణంలోని నెహ్రూనగర్‌లో గల కమ్మ కల్యాణ మండపంలో మంగళవారం ఎన్టీఆర్ జిల్లా మాజీ సైనికుల సమావేశం జరుగుతుందని మాజీ సైనిక సంఘ ప్రతినిధి వాసిరెడ్డి ప్రసాద్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎన్టీఆర్ జిల్లా స్థాయిలో జరిగే ఈ సమావేశం ఆ రోజు ఉదయం 9 గంటలకు ప్రారంభం అవుతుందన్నారు. సమావేశంలో మాజీ సైనికులకు సంబంధించిన పలు అంశాలపై చర్చిస్తారన్నారు. కార్యక్రమానికి తప్పనిసరిగా జిల్లా పరిధిలోని మాజీ సైనికులు, కుటుంబ సభ్యులు హాజరుకావాలన్నారు.

ప్రజలకు మేలు చేస్తేనే ప్రజాస్వామ్యానికి విలువ

- ఘనంగా వైఎస్సార్‌సీపీ ఆవిర్భావ దినోత్సవం
- పార్టీ పతాకాన్ని ఆవిష్కరించిన ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ

నందిగామ టౌన్: ప్రభుత్వాలు కుల, మతాలు, వర్గాలు, రాజకీయాలు చూడకుండా అన్ని వర్గాల ప్రజలకు మేలు చేస్తేనే ప్రజాస్వామ్యం అనే మాటకు విలువ, అర్థం ఉంటుందని శాసనసభ్యుడు డాక్టర్ మొండితోక జగన్‌మోహనరావు అన్నారు. స్థానిక పార్టీ కార్యాలయంలో ఆదివారం వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ పతాకాన్ని ఆవిష్కరించి ఆవిర్భావ దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ముందుగా దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖర్‌రెడ్డి విగ్రహానికి పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. శాసనమండలి సభ్యుడు డాక్టర్ మొండితోక అరుణకుమార్‌తో కలిసి కేక్ కట్ చేసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా జగన్‌మోహనరావు, అరుణకుమార్ మాట్లాడుతూ వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ప్రజల ఆశలు, ఆకాంక్షల మేరకు ఆవిర్భవించిందన్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నమ్ముకున్న సిద్ధాంతానికి కట్టుబడి పని చేయటంతో పాటు నైతిక విలువలతో కూడిన పాలన అందిస్తూ ప్రజల హృదయాలలో సుస్థిర స్థానం సంపాదించుకున్నారని అన్నారు. ఇటీవల వైజాగ్‌లో జరిగిన గ్లోబల్ సమ్మిట్‌లో దేశంలోని అతి పెద్ద పారిశ్రామికవేత్తలు పాల్గొని లక్షల కోట్లు పెట్టుబడులు పెట్టేందుకు ముందుకు రావటంతో దేశం మొత్తం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వైపే చూస్తోందన్నారు. అనంతరం గాంధీ సెంటర్ వరకు పాదయాత్రగా వెళ్లి మహానేత విగ్రహానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో పార్టీ పట్టణ, మండల కన్వీనర్లు దొంతిరెడ్డి దేవేందర్‌రెడ్డి, మంచాల చంద్రశేఖర్, వ్యవసాయాభివృద్ధి సంస్థ డైరెక్టర్ మంగునూరు కొండారెడ్డి, ఎంపీపీ అరిగెల సుందరమ్మ, జెడ్పీటీసీ సభ్యులు గాదెల వెంకటేశ్వరరావు, అమర్లపూడి కీర్తి సౌజన్య, వేల్పుల ప్రశాంతి, మండల కన్వీనర్‌లు ఆవుల రమేష్‌బాబు, కందుల నాగేశ్వరరావు, షేక్ కార్పొరేషన్ డైరెక్టర్ షహనాజ్ బేగం, పార్టీ నాయకులు పాములపాటి రమేష్, గుడివాడ సాంబశివరావు, చిరుమామిళ్ల చైతన్యకుమార్, వైఎస్ఎన్ ప్రసాద్, పెద్ద సంఖ్యలో కార్యకర్తలు పాల్గొన్నారు.

కంచికచర్లలో...

కంచికచర్ల: వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ పేదవర్గాల అభ్యున్నతికి, రైతు సంక్షేమం కోసం ఆవిర్భవించిందని ఎమ్మెల్సీ డాక్టర్ మొండితోక అరుణ్ కుమార్ అన్నారు. కంచికచర్లలో ఆదివారం వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా స్థానిక నెహ్రూ బొమ్మ సెంటర్‌లో వైఎస్ రాజశేఖరరెడ్డి విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. అనంతరం భారీ కేక్ కట్ చేసి పంచిపెట్టారు. పార్టీ జెండాను ఆవిష్కరించారు. పార్టీ పట్టణ, మండల అధ్యక్షులు వేమా సురేష్‌బాబు, నన్నపనేని నరసింహారావు అధ్యక్షతన జరిగిన సమావేశంలో మాట్లాడుతూ వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ఆవిర్భవించిన నాటి నుంచి అధికారంలోకి వచ్చిన నేటి వరకు పేద బలహీన వర్గాల అభ్యున్నతి కోసం, రైతు సంక్షేమం, అభివృద్ధి కోసం పాటుపడుతోందన్నారు. ఈ ఏడాది కంచికచర్లను మరింత అభివృద్ధి చేసేందుకు అన్ని చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు.



కంచికచర్లలో మహానేత రాజశేఖరరెడ్డి విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పిస్తున్న ఎమ్మెల్సీ అరుణ్‌కుమార్, వైఎస్సార్ సీపీ నాయకులు

కంచికచర్ల మండలంలో తాగునీటి ఎద్దడి లేకుండా చూస్తామని, రోడ్లన్నీ అభివృద్ధి చేస్తామని, డ్రైనేజీలన్నీ బాగుచేస్తామన్నారు. ఇప్పటికే రూ.80 లక్షల నిధులతో పట్టణంలో ఇళ్ల మధ్యలో ఉన్న విద్యుత్ తీగెలను తొలగించేందుకు అన్ని చర్యలు చేపట్టామన్నారు. కార్యక్రమంలో కంచికచర్ల, వీరులపాడు జెడ్పీటీసీ సభ్యులు వేల్పుల ప్రశాంతి, అమర్లపూడి కీర్తి సౌజన్య, సర్పంచి వేల్పుల సునీత, సొసైటీ అధ్యక్షుడు కాలవ పెదబాబు, షేక్ కార్పొరేషన్ డైరెక్టర్ షహనాజ్‌బేగం, ఎంపీటీసీ సభ్యులు మాడుగుల మధుబాబు, నంబూరి పెదబాబు, వేల్పుల శ్రీనివాసరావు, పరిటాల రాము, వేల్పుల రమేష్ పాల్గొన్నారు.

సంక్షేమంలో కొత్త చరిత్ర లిఖించిన వైఎస్సార్ సీపీ

జగ్గయ్యపేట అర్బన్: అధికారంలోకి వచ్చిన అనతి కాలంలోనే భారతదేశ చరిత్రలో ఎవరూ, ఎన్నడూ అమలు చేయని సంక్షేమ పథకాలను అమలు చేస్తూ రాష్ట్ర చరిత్రను తిరగరాసిన పార్టీగా వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నిలిచిపోతుందని కేడీసీసీ బ్యాంక్ చైర్మన్ తన్నీరు నాగేశ్వరరావు అన్నారు. వైఎస్సార్ సీపీ ఆవిర్భావ దినోత్సవం పట్టణంలో ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పార్టీ శ్రేణులు ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే సామినేని ఉదయభాను గృహం నుంచి ప్రధాన వీధుల్లో బైకులు, కార్లతో ర్యాలీ నిర్వహించారు. అనంతరం పార్టీ నియోజకవర్గ కార్యాలయంలో జరిగిన వేడుకల్లో కేడీసీసీబీ చైర్మన్ తన్నీరు నాగేశ్వరరావు వైఎస్ రాజశేఖరరెడ్డి విగ్రహానికి నివాళులర్పించి పార్టీ జెండాను ఆవిష్కరించారు. పలువురికి మిఠాయిలు పంచారు.

పార్టీ ఆవిర్భావమే ఒక చరిత్ర

అనంతరం కేడీసీసీ బ్యాంక్ చైర్మన్ తన్నీరు నాగేశ్వరరావు మాట్లాడుతూ వైఎస్సార్‌సీపీ మూడున్నరేళ్లలోనే 98 శాతం హామీలను అమలు చేసి సరికొత్త రికార్డు సృష్టించిందన్నారు. ఏఎంసీ చైర్మన్ ముత్తినేని విజయశేఖర్, వైస్ చైర్మన్ మానేపల్లి బ్రహ్మం, మున్సిపల్ వైస్ చైర్మన్ హఫీజున్నీసా, పార్టీ కౌన్సిలర్లు, విజయవాడ దుర్గ గుడి ట్రస్ట్ బోర్డు సభ్యులు నంబూరి రవి, అల్లూరి కృష్ణవేణి భాస్కర్, పార్టీ మండల అధ్యక్షుడు చిలుకూరి శ్రీనివాస్, పట్టణ యువజన విభాగం అధ్యక్షుడు ఆవాల భవానీప్రసాద్, వివిధ అనుబంధ విభాగాల అధ్యక్షులు, సచివాలయ కన్వీనర్లు, పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

వత్సవాయిలో...

వత్సవాయి: వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ఆవిర్భావ దినోత్సవం ఆదివారం మండలంలోని పలు గ్రామాల్లో ఘనంగా నిర్వహించారు. వత్సవాయిలో సర్పంచ్ భూక్యా సీతమ్మ, జెడ్పీటీసీ యేశపోగు దేవమణి, మండల పార్టీ అధ్యక్ష, కార్యదర్శులు గాదెల రామారావు, సొసైటీ అధ్యక్షుడు రంగిశెట్టి ముత్తయ్య, మాజీ సర్పంచ్ గుత్తా శంకరరావు, మండల పరిషత్ ఉపాధ్యక్షులు కొలికిపోగు వెంకటేశ్వర్లు కేక్ కట్ చేసి వైఎస్సార్ విగ్రహానికి పూలమాలలు వేశారు. పోలంపల్లిలో కాటేపల్లి రవి, వైస్ ఎంపీపీ రామలక్ష్మి, పెంట్యాలవారిగూడెంలో వడ్డే పరమయ్య, దబ్బాకుపల్లిలో ఎంపీపీ చెంబేటి వెంకటేశ్వర్లు, సర్పంచ్ కొట్టె నగేష్, సయ్యద్‌బాబు, పండగ శ్రీను, వేములనర్వలో మాజీ ఏఎంసీ చైర్మన్ పాదిలి పద్మాలక్ష్మీనారాయణ, కంభంపాడులో వేమిరెడ్డి వెంకటనారాయణరెడ్డి, సరాల మధుసూదనరెడ్డి, భీమవరంలో గుండం రంగారెడ్డి, చింతకుంట్ల వెంకటరెడ్డి, మంగొల్లులో సామినేని లక్ష్మీనారాయణ, సర్పంచ్ అన్నెపాక ప్రణీత ఆధ్వర్యంలో పార్టీ జెండాలను ఎగరవేసి కేక్‌లు కట్ చేసి శుభాకాంక్షలు తెలుపుకొన్నారు.

వీరులపాడులో...

వీరులపాడు: నిరుపేదలకు అండగా ఉండటంతో పాటు అన్ని వర్గాల ప్రజలకు మంచి చేయాలనే సమున్నత లక్ష్యంతో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీని స్థాపించారని పార్టీ మండల కన్వీనర్ ఆవుల రమేష్‌బాబు, జెడ్పీటీసీ మాజీ సభ్యుడు కోటేరు ముత్తారెడ్డి అన్నారు. మండలంలోని పెద్దాపురం గ్రామంలో వైఎస్సార్ సీపీ కార్యాలయంలో పార్టీ ఆవిర్భావ దినోత్సవం ఘనంగా నిర్వహించారు. వైఎస్ రాజశేఖర్‌రెడ్డి గారి విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం పార్టీ పతాకాన్ని ఆవిష్కరించి కేక్ కట్ చేసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రానున్న ఎన్నికల్లో పార్టీ విజయమే లక్ష్యంగా నాయకులు, కార్యకర్తలు పని చేయాలన్నారు. ముఖ్యమంతి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి విలువలు, విశ్వసనీయతతో కూడిన పాలన అందిస్తున్నారని నాయకులు, కార్యకర్తలు, ప్రజా ప్రతినిధులు అందుకనుగుణంగా ముందుకు సాగాలని ఆకాంక్షించారు. మండలంలోని అన్ని గ్రామాలలో పార్టీ నాయకుల ఆధ్వర్యంలో ఆవిర్భావ దినోత్సవం ఘనంగా నిర్వహించారు.

జగ్గయ్యపేట మండలంలో...

జగ్గయ్యపేట: మండలంలోని అన్ని గ్రామాల్లో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ఆవిర్భావ దినోత్సవం ఆదివారం పార్టీ నాయకులు ఘనంగా నిర్వహించారు. గండ్రాయిలో వైఎస్సార్ విగ్రహానికి నాయకులు పూల మాలలు వేసి నివాళులర్పించి కేక్ కట్ చేశారు. గౌరవరంలో సొసైటీ చైర్మన్ బాలసైదా, పోచంపల్లి, ముక్త్యాల, అనుమంచిపల్లి, అగ్రహారం, మల్కాపురం, తక్కెళ్లపాడు, చిల్లకల్లు, షేర్‌మహ్మద్‌పేట గ్రామాల్లో స్థానిక పార్టీ నాయకుల ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఆయా కార్యక్రమాల్లో సర్పంచ్‌లు కొత్తపల్లి లూర్దుమేరి, బూతుకూరి లక్ష్మి, ఆవుల శ్రీనివాసరావు, పానుగంటి త్రివేణి, పార్టీ నాయకులు రాజు, పల్లెబోయిన యలమందరావు, కనపర్తి ప్రసాద్, గోపీచంద్, రాజేంద్ర, రమేష్, తదితరులు పాల్గొన్నారు.



నందిగామలో పార్టీ పతాకాన్ని ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే జగన్‌మోహనరావు, ఎమ్మెల్సీ అరుణకుమార్



పేటలో వైఎస్సార్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న తన్నీరు నాగేశ్వరరావు, పార్టీ నాయకులు



వత్సవాయిలో వైఎస్సార్ విగ్రహానికి పూలమాల వేస్తున్న జెడ్పీటీసీ దేవమణి

ప్రజల కోసం పుట్టిన పార్టీ వైఎస్సార్ సీపీ



పెనుగంచిప్రోలులో కేక్ కట్‌చేస్తున్న జెడ్పీటీసీ సభ్యురాలు నాగమణి, ఎంపీపీ గాంధీ తదితరులు

పెనుగంచిప్రోలు: ప్రజల కోసం పుట్టిన పార్టీ వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అని ఎంపీపీ మార్కపూడి గాంధీ, జెడ్పీటీసీ సభ్యురాలు వూట్ల నాగమణి అన్నారు. పార్టీ వ్యవస్థాపక దినోత్సవం ఆదివారం మండల కేంద్రం పెనుగంచిప్రోలులో ఘనంగా నిర్వహించారు. ముందుగా గ్రామంలోని మహానేత వైఎస్ రాజశేఖరరెడ్డి విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించటంతో పాటు పార్టీ జెండాలు ఆవిష్కరించి కేక్ కట్ చేసి స్వీట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా పలువురు నాయకులు మాట్లాడుతూ రాష్ట్రంలో పేద, బడుగు, బలహీన వర్గాల సంక్షేమమే ధ్యేయంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలన సాగిస్తున్నారన్నారు. రాష్ట్రంలో జగనన్న, నియోజకవర్గంలో ఎమ్మెల్యే ఉదయభాను సారథ్యంలో వైఎస్సార్‌సీపీ బలోపేతానికి కృషి చేస్తామన్నారు. కార్యక్రమంలో శ్రీ తిరుపతమ్మ ఆలయ చైర్మన్ ఇంజం చెన్నకేశవరావు, మైనింగ్, పూసల కార్పొరేషన్ డైరెక్టర్లు బత్తుల రామారావు, చేని కుమారి, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు వూట్ల నాగేశ్వరరావు, గ్రామ అధ్యక్షుడు కాకాని హరి, ఎంపీటీసీ సభ్యులు కాకాని స్రవంతి, కీసర లోకేశ్వరరావు, సచివాలయాల మండల కన్వీనర్ కన్నెమాల శామ్యూల్, మార్కెట్ యార్డు డైరెక్టర్ తమ్మిశెట్టి సోమయ్య, సొసైటీ అధ్యక్షుడు గింజుపల్లి నరసింహారావు, మండల ట్రేడ్ యూనియన్ అధ్యక్షుడు దేరంగుల శ్రీనివాసరావు, మండల యూత్ కన్వీనర్ పోపూరి రమేష్, వివిధ గ్రామాల సర్పంచ్‌లు పాల్గొన్నారు. సర్పంచ్ వేల్పుల పద్మకుమారి ఆధ్వర్యంలో వైఎస్ రాజశేఖరరెడ్డి విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. కేక్ కట్ చేశారు. కార్యక్రమంలో మండల సమాఖ్య అధ్యక్షురాలు కాకాని పద్మ, గ్రామాభివృద్ధి కమిటీ చైర్మన్ వేల్పుల రవికుమార్, పేరెంట్స్ కమిటీ చైర్మన్ బత్తుల వెంకటనర్సు, వార్డు సభ్యులు పాల్గొన్నారు.

వైఎస్సార్ సీపీలో చేరిన 25 కుటుంబాలు

కంచికచర్ల: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహనరెడ్డి రాష్ట్రంలోని కులమతాలకు అతీతంగా అన్ని వర్గాల ప్రజలకు చేస్తున్న అభివృద్ధి, సంక్షేమాన్ని చూసి ఇతర పార్టీల నుంచి వైఎస్సార్ కాంగ్రెస్‌పార్టీలోకి చేరుతున్నారని శాసనమండలి సభ్యులు డాక్టర్ మొండితోక అరుణ్‌కుమార్ అన్నారు. కంచికచర్లలో జరిగిన వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ఆవిర్భావ దినోత్సవం కార్యక్రమం అనంతరం ఇతర పార్టీల నుంచి 25 కుటుంబాల సభ్యులు ఆదివారం వైఎస్సార్‌సీపీలోకి చేరారు. పార్టీలో చేరిన వారికి ఎమ్మెల్సీ పార్టీ కండువాలు కప్పి సాదరంగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కంచికచర్ల నుంచి బలమైన యువజన నాయకుడు అనుమల వాసు, మాగంటి నరేష్, గూడవల్లి పిచ్చయ్య, ఆకుల శ్రీహరి, షేక్ ఉద్దండు, గొల్లా ప్రవీణ్‌కృష్ణ, మక్కా శ్రీను, వారితో పాటు 25 కుటుంబాలు పార్టీలో చేరటం చాలా శుభపరిణామమన్నారు.



వైఎస్సార్‌సీపీలో చేరిన వారికి పార్టీ కండువా కప్పి ఆహ్వానిస్తున్న ఎమ్మెల్సీ అరుణ్‌కుమార్

24 బీసీ కులాలను గుర్తించాలి

జగ్గయ్యపేట అర్బన్: జగ్గయ్యపేట నియోజకవర్గ వ్యాప్తంగా ఉన్న 24 బీసీ కులాలను రాజకీయ పార్టీలు గుర్తించి వారికి రాజ్యాధికారంలో వాటా కల్పించాలని బీసీ సంక్షేమ సంఘం జాతీయ కార్యదర్శి మండవ శ్రీనివాసగౌడ్ అన్నారు. స్థానిక మినీ బైపాస్ రోడ్‌లో ఉన్న బీసీ భవన్‌లో ఆదివారం జగ్గయ్యపేట నియోజకవర్గ స్థాయిలో ఉన్న 24 బీసీ కులాల ముఖ్య నాయకుల సమావేశం శ్రీనివాసగౌడ్ అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నియోజకవర్గ స్థాయిలో 24 కులాలకు బీసీలు 50 వేల మందికి పైగా ఉన్నప్పటికి కేవలం ఒకటి, రెండు కులాల వారికే పదవులు దక్కుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. దీని వలన అణగారిన బీసీ వర్గాలకు అన్యాయం జరుగుతోందన్నారు. రాజకీయ పార్టీలు బీసీలను కేవలం ఓటు బ్యాంకు గానే చూస్తున్నాయని, 24 బీసీ కులాలను, కుల వృత్తుల వారిని బలోపేతం చేసేందుకు చర్యలు తీసుకోనున్నట్లు తెలిపారు. బీసీ నాయకులు తూమాటి కృష్ణమాచార్యులు, దేవరకొండ శ్రీను, ఉప్పుతోళ్ల వెంకటేశ్వర్లు, పోలంపల్లి రాధమ్మ, చాపల వెంకటేశ్వర్లు, వేముల మల్లేశ్వరరావు, చంద్రమౌళి, తంగెళ్ల శ్రీనివాసరాజు, గోనెల పద్మావతి, మోహనరావు, పులి శ్రీనివాసరావు, సుబ్బారావు, డేవిడ్, శేఖర్ తదితరులు పాల్గొన్నారు.



బీసీ కులాల ముఖ్య నాయకుల సమావేశంలో పాల్గొన్న శ్రీనివాసగౌడ్, బీసీ నాయకులు

భక్తిశ్రద్ధలతో అమ్మవారికి బోనాలు



బోనాలను ఊరేగింపుగా తీసుకువస్తున్న గ్రామస్తులు

షేర్‌మహ్మద్‌పేట(జగ్గయ్యపేట): గ్రామంలో ఉన్న అంకమ్మ అమ్మవారికి ఆదివారం గ్రామస్తులు భక్తిశ్రద్ధలతో బోనాలు సమర్పించారు. గ్రామస్తులు ప్రత్యేకంగా తయారు చేసిన బోనాలను ఊరేగింపుగా తీసుకువచ్చి అమ్మవారికి సమర్పించారు. ప్రతి ఏటా అంకమ్మ అమ్మవారికి బోనాలు సమర్పించటం ఆనవాయితీగా వస్తోందని ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు.

నేడు తహసీల్దార్ కార్యాలయంలో స్పందన

కంచికచర్ల: ప్రజా సమస్యల పరిష్కార వేదిక స్పందన కార్యక్రమం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం ఉదయం 10 గంటల నుంచి జరుగుతుందని తహసీల్దార్ వడ్డేశ్వరపు రాజకుమారి ఆదివారం తెలిపారు. గ్రామాల్లోని సమస్యల పరిష్కరించేందుకు ప్రజలు అర్జీలు దాఖలు చేసుకోవాలని, వచ్చిన అర్జీలను ప్రాధాన్యతాక్రమంలో పరిష్కరిస్తామని తెలిపారు.

వరాహ వేదన ఆలకించిన అధికారులు

సాక్షి ఎఫెక్ట్

పెనుగంచిప్రోలు: గ్రామంలో పందులకు స్వైన్ ఫీవర్ లక్షణాలున్నాయని పశువైద్యాధికారి అనిల్ అన్నారు. 'వరాహ వేదన' అనే శీర్షికతో సాక్షి దినపత్రికలో వచ్చిన కథనానికి అధికారులు స్పందించారు. ఆదివారం గ్రామంలోని పందుల పెంపకందారుల గృహాలకు వెళ్లి సర్వే నిర్వహించారు. అద్దంకి వెంకటేశ్వర్లు ఇంట్లో తీవ్ర జ్వరంతో బాధపడుతున్న పందిని పరిశీలించి ఇంజెక్షన్లు అందజేశారు. అనంతరం తీసుకోవాల్సిన జాగ్రత్తలను తెలిపారు. వైద్యాధికారి మాట్లాడుతూ ఇవి స్వైన్ ఫీవర్ లక్షణాలని వైరస్ వలన ఇలా వస్తాయన్నారు. దీనివలన మనుషులకు ఎటువంటి ప్రమాదం ఉండదన్నారు. సోమవారం జిల్లా అధికారుల ఆధ్వర్యంలో శాంపిల్స్ సేకరించి, వ్యాధికి గల కారణాలు తెలియజేస్తామన్నారు. స్వైన్ ఫీవర్ వ్యాధికి వ్యాక్సిన్ ఉందని, దానిని ఇస్తామన్నారు. పందులకు వ్యర్థాలు పడేస్తున్నారని, మురుగు నీరు తాగుతున్నాయని, అవి కలుషితం అయినా ఇలాంటి వ్యాధులు వస్తాయన్నారు.



పందుల పెంపకందారులకు సూచనలిస్తున్న వైద్యాధికారి అనిల్

మానసిక శాస్త్ర నిపుణులు కార్టూనిస్ట్‌లు

విజయవాడ కల్చరల్: మానసిక శాస్త్ర నిపుణులు కార్టూనిస్ట్‌లని సీనియర్ పాత్రికుడు ఘంటా విజయకుమార్ అన్నారు. మల్లెతీగ సాహిత్యవేదక ఆధ్వర్యంలో ఘంటా ఇందిర స్మారక జాతీయ స్థాయి కార్టూన్ ఫలితాల ప్రకటన కార్యక్రమాన్ని కృష్ణానదీ తీరంలో ఆదివారం ప్రకటించారు. ఆయన మాట్లాడుతూ కార్టూన్లు సామాజిక చైతన్యకలిగించి సామాజిక ప్రయోజనం కలిగించాలని సూచించారు. మల్లెతీగ సాహిత్య పత్రిక సంపాదకులు కలిమిశ్రీ ఉభయ రాష్ట్రాలలోని ప్రముఖ కార్టూనిస్ట్‌లు పోటీలో పాల్గొన్నారని తెలిపారు. ఉత్తమ కార్టూనిస్ట్ బొమ్మన్‌కు రూ.10 వేల నగదు బహుమతి సత్కారం, ఐదువందల నగదు బహుమతి పొందిన కార్టూన్ల విజేతలు, వల్లూరి కృష్ణ, ప్రసిద్ధ, హైదరాబాద్, చిదంబరం, ఆదినారాయణ, నాగిశెట్టి, మురళీధర్ విజయవాడ, జెన్నా విశాఖపట్నం, భూపతి కరీంనగర్, గోపాల కృష్ణ పెనుగొండ, డీ శంకర్ కోరుట్ల, ఎన్ శేషయ్య తిరుపతి, పైడి శ్రీనివాస్ వరంగల్, వినోద్ సఖిరేటిపల్లి, కార్యక్రమంలో వివిధ రంగాలకు చెందిన కే సంపత్, చొప్పా రాఘవేంద్ర ప్రసాద్, కుర్రా సురేష్‌బాబు, ఎజీ ప్రసన్నకుమార్ పాల్గొన్నారు.



విజేతల వివరాలు తెలియజేస్తున్న నిర్వాహకులు విజయకుమార్, రాఘవేంద్రరావు

మహిళల విజయాన్ని స్వాగతించాలి

ఏపీ పారిశ్రామిక అభివృద్ధి సంస్థ చైర్ పర్సన్ పుణ్యశీల

విజయవాడ కల్చరల్: మహిళల విజయాన్ని స్వాగతించాలని ఆంధ్రప్రదేశ్ పారిశ్రామిక అభివృద్ధి సంస్థ చైర్ పర్సన్ పుణ్యశీల రాజ్‌కుమార్ అన్నారు. డ్రీమ్ ఆడియో ఆధ్వర్యంలో గాంధీనగర్‌లోని కొత్తా పూర్ణానందం కళావేదికమీద ఆదివారం అంతర్జాతీయ మహిళా దినోత్సవ ముగింపు వేడుకలు, మహిళలకు స్వరాంజలి, సప్తస్వరాలు పురస్కార కార్యక్రమాన్ని నిర్వహించింది. ఈ సందర్భంగా పుణ్యశీల మాట్లాడుతూ సమాజ పురోభివృద్ధిలో మహిళల పాత్ర చిరస్మరణీయమైనదని తెలిపారు. ప్రభుత్వం మహిళా సంక్షేమ కోసం అనేక కార్యక్రమాలను చేస్తోందని వారికోసం చిత్త శుద్ధితో పనిచేస్తునట్లు తెలిపారు. బ్రాహ్మణ సేవా సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కొప్పరపు బలరామకృష్ణ మాట్లాడుతూ మహిళలు అన్ని రంగాలలోనూ తమ ప్రతిభను చాటుకుంటున్నారన్నారు. కార్యక్రమంలో వివిధ రంగాలకు చెందిన పరచూరి విజయలక్ష్మి, జ్యోతిష్యశాస్త్రవేత్త ప్రసూనా రామన్, కొప్పరపు ఉమాబలరాం, వడ్డాది కామేశ్వరి ప్రసంగించారు. చావా నరసింహారావు పర్యవేక్షణలో సుధారాణి, భారతి, విష్ణుప్రియ, రూపాశ్రీ, అమలారాణి, సింధూ తదితరులు పలు చిత్ర గీతాలను ఆలపించారు. మహిళా దినోత్సవం సందర్భంగా గాయనీమణులను నిర్వాహకులు సత్కరించారు.



మహిళలను సత్కరిస్తున్న పుణ్యశీల, విజయలక్ష్మి, ప్రసూనా రామన్

భగవద్గీతపై అవగాహన కల్పించాలి



గీత శిక్షణ కార్యక్రమంలో పాల్గొన్న చిన్నారులు

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): మానసిక వికాసానికి మరింత బాటలు వేసేందుకు కర్తవ్య దీక్షను గుర్తు చేసే భగవద్గీతపై అవగాహన పెంచాలని గోవింద నామ ప్రచార సంఘం అధ్యక్షుడు మధుసూదన స్వామి అన్నారు. బందరు రోడ్డులోని ఠాగూర్ స్మారక గ్రంథాలయంలో భగవద్గీత జ్ఞాన బోధ శిక్షణ తరగతులు ఆదివారం జరిగాయి. ఈ కార్యక్రమంలో పాల్గొన్న ఆయన మాట్లాడుతూ భగవద్గీత ఏ ఒక్క మతానికి చెందిన గ్రంథంగా భావించకూడదన్నారు. కులమతాలకు అతీతంగా సమాజంలోని అన్ని వర్గాలకు మానవ జీవన ధర్మాన్ని బోధిస్తుందన్నారు. జీవితంలో ఎలా నడుచుకోవాలో తెలిపే మార్గదర్శక గ్రంథమని పేర్కొన్నారు. గ్రంథాలయంలో భగవద్గీత శిక్షణ పొందుతున్న చిన్నారులకు బెంగళూరుకు చెందిన గీతా ప్రచారకులు కర్పూరం తిరుపతిరావు, రాహుల్, నివేదితలు విద్యార్థులకు పండ్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో గ్రంథాలయాధికారి కె రమాదేవి, సిబ్బంది పీవీవీ ఫణిబాబు, గోపాలరావు, జి.ఝాన్సీ, దుర్గాంబ, గీతా బోధకురాలు సునీత పాల్గొన్నారు.